మహిళా వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డులు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ సేవా అవార్డులు లభించాయి.ఉత్తమ అధ్యక్షురాలిగా ఎం.శేషామణి, ఉత్తమ కార్యదర్శిగా సనపల పుష్పలత, ఉత్తమ కోశాధికారిగా సిహెచ్.లక్ష్మి, ఉత్తమ బులిటెన్ ఎడిటర్‌గా దర్బా శిరీష, డిస్ట్రిక్ట్-101 ప్రో, ట్రస్ట్‌బోర్డు మెంబర్‌గా కె.మాధవి అవార్డులు అందుకున్నారు.



మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్

అధికారం చేపట్టిన నాటి నుంచి పాలనలో తనదైన మార్క్ చూపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి.. గత ప్రభుత్వాలకు, ఈ ప్రభుత్వానికి బేరీజు వేసుకునేలా అభివృద్ధి చేసి చూపిస్తున్నారు. ముఖ్యంగా నాడు-నేడు ద్వారా విద్యారంగం అభివృద్ధికి ఆయన చూపిన శ్రద్ధతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది. ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలు అంటే పాడుబడినట్లు ఉండే భవనాలు నేడు కార్పొరేట్‌కు దీటుగా వెలుగొందుతున్నాయి. ఒకప్పుడు శిథిలమైన భవనాలు, పెచ్చులూడిన గచ్చులు, విరిగిపోయిన బల్లలు, వర్షం పడితే తడుస్తూ చదువుకోవాల్సిన దుస్థితి నుంచి నేడు చక్కగా అన్ని వసతులతో విద్యార్జన చేసుకునే సదుపాయం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కల్పించారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సర్కారు బడులు గొప్పగా వెలుగొందుతున్నాయి. తన మార్కు పాలనతో శభాష్ అనిపించుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు కొత్తరూపు ఇచ్చి విద్య పట్ల చిన్నారుల్లో మక్కువ కల్పిస్తున్నారు.

సర్కారు బడి.. నూతన ఒరవడి

- నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ
- కార్పొరేట్ రూపు దిద్దుకున్న ఎంజీఎం హైస్కూల్
- అడ్మిషన్లకు క్యూ కడుతున్న విద్యార్థులు

అల్లిపురం: విద్యా, వైద్యానికి మొదటి ప్రాధాన్యతగా వైఎస్సార్‌సీపీ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. దీంట్లో భాగంగా నాడు-నేడు కార్యక్రమాల్లో భాగంగా ఫస్ట్‌ఫేస్‌లో డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌ను రూ.41.08 లక్షలతో అభివృద్ధి చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో ప్రైవేటు పాఠశాలల నుంచి కూడా విద్యార్థులు ఎంజీఎం హై స్కూల్లో చేరారు. కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా పాఠశాలలోని టాయిలెట్స్, తరగతి గదులు, ఫర్నిచర్, గ్రీన్ బోర్డులు, ఎలక్ట్రిఫికేషన్, కాంపౌండ్ వాల్ నిర్మాణాలు చేపట్టారు.

అభివృద్ధి జరిగింది ఇలా..

పని	వ్యయం
కాంపౌండ్ వాల్ నిర్మాణానికి	రూ.3.20 లక్షలు
ఎలక్ట్రిఫికేషన్‌కు	రూ.2 లక్షలు
టాయిలెట్ల నిర్మాణానికి	రూ.50 వేలు
ఫర్నిచర్‌కు	రూ.1.60 లక్షలు
గ్రీన్ క్లాస్ బోర్డుల ఏర్పాటుకు	రూ.1.70 లక్షలు
మేజర్-మైనర్ రిపేర్లకు	రూ.32.80 లక్షలు





ఎంజీఎం పాఠశాల ఆవరణ నాడు, నేడు





ప్రైవేట్ స్కూల్‌కు దీటుగా..



నేను ప్రైవేట్ స్కూల్ నుంచి మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూల్లో 8వ తరగతిలో జాయిన్ అయ్యాను. ఇక్కడ ప్రైవేట్ స్కూలుకి దీటుగా విద్యా బోధన జరుగుతోంది. ఇంగ్లీష్ మీడియంలో బోధిస్తున్నారు.

– పీవీఎస్ఎన్ త్రిశూర్, 10వ తరగతి

సౌకర్యాలు బాగున్నాయి..



ప్రైవేట్ స్కూల్‌కు దీటుగా మా స్కూల్‌లో సౌకర్యాలు ఉన్నాయి. ఆడపిల్లలకు చక్కటి సెక్యూరిటీ ఉంది. ఉపాధ్యాయుల బోధన చాలా బాగుంది. విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యేలా చెబుతున్నారు.

– ఒ.చాందిని, 8వ తరగతి

ప్రభుత్వ చర్యలు అభినందనీయం..



రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో తీసుకున్న చర్యలు అభినందనీయం. విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు అందజేస్తున్నారు. తరగతి గదులు డిజిటలైజ్ చేయడం వలన విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది.

– అప్పలరాజు,
8వ తరగతి విద్యార్థి తండ్రి

డిజిటలైజేషన్‌తో ఆసక్తి..



తరగతి గదులు డిజిటలైజేషన్ వలన విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. క్లాస్ రూమ్‌లో దృశ్య, శ్రవణ పద్ధతిలో పాఠాలు బోధించడంతో సులువుగా పాఠాలు అర్థమవుతున్నాయి. వీటితో పాటు రూ.41.07 లక్షలతో పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టాం.

– ఆర్‌వీఎస్ఎస్ నాగభూషణం, ప్రధానోపాధ్యాయులు, ఎంజీఎం హైస్కూల్

గ్రంథాలయంలో దివంగత ఇందిర జయంతి


ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయిని రామలక్ష్మి తదితరులు

డాబాగార్డెన్స్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. సీక్రెడ్‌హార్ట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ అసిస్టెంట్, ఆంగ్ల ఉపాధ్యాయిని రావులపల్లి రామలక్ష్మి పాల్గొని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ విశాఖ జిల్లా కార్యదర్శి ప్రియ పాల్గొని గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవ ప్రాముఖ్యత వివరించారు. విద్యార్థులకు మహిళా సాధికారతపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు మాట్లాడుతూ ముగింపోత్సవంలో విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సమాజ హిత పత్రిక సంపాదకుడు కేవీ నరసింహం, అసిస్టెంట్ లైబ్రేరియన్ వర్మ, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు పునీత అన్నమ్మ పాల్గొని ఇందిరాగాంధీకి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహిళలకు మ్యూజికల్ చైర్ పోటీలు, లెమన్ స్పూన్, ముగ్గుల పోటీలు, విద్యార్థులకు చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పోలితల్లి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కె. జయమ్మ, పి. శశికళ, వి. ధన, జె. లక్ష్మి, వై. పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాజస్థానీ సాంస్కృతిక మండల్ ఆర్చి ఆవిష్కరణ


ఆర్చిను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : జిల్లా పరిషత్ సమీపాన గల కనక మహాలక్ష్మి ఆస్పత్రి దగ్గరున్న రాజస్థానీ సాంస్కృతిక మండల్ ఆర్చ్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల్ అధ్యక్షుడు శంకర్‌లాల్, సభ్యులు పాల్గొన్నారు.

వీర వనిత ఝాన్సీ లక్ష్మీభాయ్


ఝాన్సీ లక్ష్మిభాయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

జగదాంబ : వీర వనిత ఝాన్సీ లక్ష్మీభాయ్ అని స్వామి వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ జహీర్ అహ్మద్ అన్నారు. ఆదివారం ఝాన్సీ లక్ష్మీభాయ్ జయంతి సందర్భంగా సంస్థలో ఘనంగా నివాళులు అర్పించారు. అమరవీరుల త్యాగాలు స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరకు నివాళి..

అల్లిపురం : గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం అల్లిపురం గ్రంథాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పిల్లలకు మహిళా సాధికారత, దిశ చట్టంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది, చిన్నారులు

క్రికెట్ కర్ఫ్యూ

- రోడ్లన్నీ నిర్మానుష్యం
- కానరాని వాహనాలు

అల్లిపురం : ప్రపంచ కప్ క్రికెట్ ఫీవర్ అందరినీ ఆవరించింది. ఆదివారం కొన్ని చోట్ల బిగ్ స్క్రీన్లు ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాలు జాతరను తలపించాయి. చిన్నారులు జాతీయ జెండాలు చేతపట్టి, బుగ్గలపై మువ్వన్నెలు జెండాలను చిత్రీకరించి సందడి చేశారు.


వరల్డ్‌కప్ నమూనాతో జయహో భారత్ అంటూ యువకుల నినాదాలు

జాతీయ జెండాతో నినాదాలు..

డాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గంలో వరల్డ్‌కప్ సందడి కనిపించింది. అసలే ఆదివారం.. ఆపై ప్రపంచకప్ ఫైనల్ పోటీ. అందునా భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మ్యాచ్ కావడంతో ఉదయం వరకు రద్దీగా ఉన్న నగరం.. మధ్యాహ్నం 2 గంటల నుంచి బోసిపోయింది. 31వ వార్డు వైఎస్సార్ సీపీ వార్డు నాయకుడు దొడ్డి బాపూ ఆనంద్ వరల్డ్‌కప్ నమూనాతో వార్డు పరిధి డాబాగార్డెన్స్, సూర్యాబాగ్, జగదాంబ జంక్షన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు.

యాత్రను విజయవంతం చేయాలి


నాయకులతో సమావేశమైన 35వ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి

జగదాంబ : ప్రజా సాధికార యాత్రను విజయవంతం చేయాలని జీవీఎంసీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి అన్నారు. ఆదివారం వార్డులో కార్యకర్తలతో కలిసి ఈనెల 22న జరిగే బస్సు యాత్ర విజయవంతం చేయడానికి సన్నాహాలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు రమణమ్మ, పుష్ప, గంగాధర్ తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గోవర్ధన పూజ

ఎంవీపీ కాలనీ: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో గోపూజ, గోవర్ధన పూజలను ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ నిష్కించిన భక్తదాస భక్తులకు గోవర్ధన లీలా విశేషాలు వివరించారు.